


# మామి

సముద్రంలా గంభీరంగా—

చెరుకు రసంలా తియ్యగా—

మృదుల మధురంగా రేడియోలో పాడుతున్నది గాయని.

'రిగా .... గమపాపా .... గమపమగారీ .... పదు గరి సాసా....'

రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్న నక్షత్రంలా అందుకుంది వయొలిన్.

“మామీ ! .... మామీ ! ఇది ఆనందభైరవి కదూ ....” అన్నాడు రాము పరుగెత్తుకుంటూ వచ్చి. తల వూపింది పట్టమ్మ. ఆమె ప్రక్కనే కూర్చున్నాడు రాము.

ఆనందభైరవిలో శ్యామశాస్త్రి కృతి, తర్వాత ముద్దుస్వామి దీక్షితుల 'నీలకంఠం భజేహం ....' మొదలయింది.

“మామీ ! మీ ఇంట్లో కుంపటిమీద ఏం ఉందో చెప్పనా—అవియల్ ! .... అవునా ?”

ఫక్కున నవ్వింది మామి.

“ఎందుకు నవ్వారూ ?”

“నీ చెవి ముక్కూ కూడా చాల మేలు జాతి వోయ్ రామూ ! .... మంచి రసికుడివి అవుతావులే—” అని మళ్లీ నవ్వింది ఆమె.

“మరి మీతోబాటు ఇన్ని కచ్చేరీలకు వస్తున్నానుగా .... కనీసం రాగాలయినా తెలియవద్దూ.”

“మరి అవియల్ ?” అని అడిగింది మామి. ఆమె రవల ముక్కుపుడక తళుక్కుమంది.

“అవియలంటే నాకు బోలెడు ఇష్టంగా — అందుకనీ — వెంటనే తెలిసిపోయింది” అన్నాడు రాము.

'దక్షతర మీశ్వరం .... కేదారగౌళ—ప్రియకరం .... నీసారీరీరీ' — చరణాన్ని అందుకుంది రేడియో గాయని.

“అయితే ఈపూట మా ఇంట్లోనే భోంచేయవోయ్ రామూ !”

వాడేమీ పలకలేదు.

“నేను మీ అమ్మతో చెబుతాలే.”

"అదికాదు మామీ ... మా ఇంట్లోనేమో ఇవాళ —అమ్మా కొబ్బరి పచ్చడి చేసిందీ .... దానిని వదలి రావడం ఎలాగా అని ?"

"అవియలూ, కొబ్బరి పచ్చడీ అన్నీ కావాలంటే కుదరదోయ్ — జీవితంలో."

ఆమె ఆ వాక్యాన్ని మామూలుగానే పలికినా, దానికి అంతకన్న ఎక్కువ అర్థం ఉన్నట్లు అనిపించింది. కాని అదేవిటో తెలియలేదు. రాముకి .... మరి ఆ వయస్సులో తెల్లనివే కాక నల్లనివీ, పచ్చటివీ కూడా పాలేనని నమ్మే పువ్వులాటి వయసు...

"ఓ పని చేస్తాను మామీ!.....ఏం....మీరే మా అమ్మతో నే నిక్కడం భోంచేస్తానని చెప్పండీ..... నేనేమో మా ఇంట్లోంచి కొంచెం కొబ్బరి పచ్చడి పట్టుకొస్తాను......"

"ఏవి(టా పట్టుకొచ్చేదీ....." అంటూ వచ్చింది రాజమ్మ.

"ఏమీ లేదమ్మా....మామీ.....మామీ....." రాము తడబడుతుంటే పట్టమ్మ అందుకుంది........ "రాజమ్మగారూ! మీ అబ్బాయిని ఈ పూట నాతో భోజనం చెయ్యమన్నానండీ....."

"ఓహో!"

"అమ్మా అమ్మా! మామి అవియల్ చేసిందేవ్!"

"ఏడిశావ్—తిండిపోతు వెధవ....." అని రాజమ్మ నవ్వుతూ రాము చెవి మెలియబెట్టబోయేనరికి వాడు పరుగెత్తుకెళ్ళి మామి వెనక దాక్కున్నాడు.

అక్కడనుండే పలికాడు: "నేనేం తిండిపోతును కాను తెలుసా.....నాకు మొన్న బళ్ళో ఎన్ని బహుమతులు వచ్చాయని....."

"అంతేకాదండీ రాజమ్మగారూ! మీ అబ్బాయికి రాగజ్ఞానమూ, పాకజ్ఞానమూ కూడా వున్నాయి!!"

"ఆ.....! ఈ వెధవని మీరే మెచ్చుకోవాలి....." అంది రాజమ్మ.....రాము ఆమె దగ్గరకు వచ్చాడు.

"అమ్మా! అమ్మా!.....మరే మనింటో కొబ్బరి పచ్చడి చేశావే, అది మామికి ఇవ్వనూ?"

రాజమ్మ మామిని చూసింది. ఆమెను నవ్వింది·

"వెధవాయి.....తన క్కావాలని చెప్పడు చూశారా! అంది రాజమ్మ. తన అబ్బాయి ప్రతిభకు ఆమె పడిన ముచ్చట చూసిన మామి మొహంమీద మబ్బులు వర్షించి వెళ్ళాయి. అది ఒక్క క్షణం.

రాము కొబ్బరి పచ్చడీ తన కంచమూ తెచ్చుకున్నాడు. వాడూ మామీ భోజనానికి కూరుచున్నారు.

"మరి.....మామయ్య రారా మామీ?"

"రారు!"

ఆమె స్వరం విని ఉలిక్కిపడి చూశాడు రాము. మామి ఒక్క నిముషంసేపు మొహాన్ని ఆ కొట్ తిప్పుకుంది.....ఏమిటో?

ఇటు తిరిగిన మామి మొహం మామూలుగా వుంది. "మామయ్య కొత్త కారు కొనడానికి బెంగుళూరు వెళ్ళారోయ్....."

"మన ఊళ్ళో క్రొత్త కార్లు బోలెడున్నాయిగా" కేనికయినాసరే మద్రాసుకన్న మించిన నగరం లేదన్నది అప్పటి రాము జాగ్రఫీ.

"ఉంటాయనుకో.....అక్కడయితే తెలిసిన వాళ్ళున్నారు....అంచేత చవగ్గా వస్తుందని వెళ్ళారు..... ఏన్నట్లు, అవియల్ ఇంకాస్త వేసుకోవేం—"

అటుకెళ్ళి వాటాలో రాజమ్మ భర్తకు వడ్డిస్తూంది.

"ఏడేడీ—?"

"పట్టమ్మ ఇంటో భోంచేస్తున్నాడ ు....."

"ఏవిటి విశేషం?"

"ఏమీలేదు ..... వాళ్ళాయిన ఊళ్ళోలేడుకద ..... వీడుంటే కాస్త పూనుపోతుందని పిలిచినట్లుంది...."

"వాళ్ళాయన వూళ్ళో లేడూ!"

"బెంగుళూర్‌లో ఓ ప్రక్కన రేసులయిపోతుంటే ఆయన ఇక్కడెలా వుండగలడండీ....."

"మరే.....ఇంకాస్త పులుసు వడ్డించూ........ అయినా ఆ ముత్తుకృష్ణయ్యకు అదేం పిచ్చో.....! వెధవ డబ్బుని ఇక్కడ గిండిలో తగలేస్తే చాలదూ? పై ఊళ్ళ క్కూడా పోవాలా?"

"టాక్సీమీద డబ్బు అంత సులభంగా వచ్చిపడుతుంటే అది ఖర్చవద్దుటండీ.."

"హుం......పిల్లాజెల్లా లేదుకదా.... వాలుగుడబ్బు తోస్తున్నప్పుడు దాచుకోక పారేసుకుంటున్నారు..... మనకేమో వచ్చింది చాలక అప్పులు చేస్తున్నాం..... అదీ తమాషా" అన్నాడు సుందరయ్య.

పైకి తేలిన నీళ్ళకూ, అడుగున వుండిపోయిన మడ్డిగకూ మధ్య నో విధమయిన స్థిర నిశ్చలత తెప్పిద్దామని ప్రయత్నించింది రాజమ్మ.....

.....పెద్ద వీధిలోని ఆ పెంకుటింటిముందు తరచుగా పెద్ద కారొక్కటి ఆగడంచూసి ఆ వీధిలో వాళ్ళెవరూ ముక్కుమీద వేలు వేసుకోరు......ఆ కారు.....లుంగీపంచమీద కోటు వేసుకునివెళ్ళే ముత్తు ముత్తుకృష్ణయ్యగారి టాక్సీ—అని అందరూ ఎరుగుదురు.

ఆ ఇంటోని అయిదు గదులలో మూడింటిని ముత్తుకృష్ణయ్య దంపతులు అద్దెకు తీసుకున్నారు. మిగతా రెండు గదులలోనూ రామూవాళ్ళుంటున్నారు.

తొమ్మిదేళ్ళక్రింద కట్టుబట్టలతో తంజావూరు వదిలాడు ముత్తుకృష్ణన్. మదరాసువచ్చి ఓ హోటల్‌లో పనికి కుదిరాడు. ఆ హోటల్‌కు రోజూ పళనిసెట్టియార్ అని పెద్ద నగల వ్యాపారి కారుతో వచ్చేవాడు. మడతలు మడతలుగా పొంగిన ఆయన ఘన శరీరంమీద చాలచోట్ల బంగారమూ కెంపులూ మెరిసిపోతుంటే ముత్తు మనసులో ఆశలు విచ్చలవిడిగా రేగిపోయేవి. ఎప్పుడు తను అలా కాగలడు?—ఎప్పుడు? ఎలా?.....ఆయనకు రెండు కార్లున్నాయట.....ఓ రేసు గుర్రమూ వుందిట— అని ఆయన కారు డ్రైవర్ చంద్రన్‌చెప్పాడు....

చంద్రన్ పరిచయంతో గిండీలోకి అడుగు పెట్టాడు ముత్తు.....అదృష్టానికీ, అది కానిదానికీ అనేక దారులు. అందులో ఒకటి గుర్రప్పందాలు. అయిదేళ్ళ కాలంలో ముత్తు మూడు వేలు సేకరించాడు. మంత్రిగారి బంధువుకు మళ్ళే అతడిని వరించింది మహాలక్ష్మి. ఆ మూడువేల మొత్తం రెండింతలయింది. ముత్తుకృష్ణన్ ముత్తుకృష్ణయ్య అయ్యాడు. సంసారం పెట్టాడు.

ముత్తుకృష్ణయ్య ఓ పాతకారు కొన్నాడు. చంద్రన్‌ని డ్రైవర్‌గా నియమించాడు. టాక్సీ నడిపించాడు. అతడి జీవితం రేసు గుర్రంలా, టాక్సీ కారులా, దర్బార్ రాగంలా సాగిపోతూంది. పట్టమ్మ ఒంటినిండా బంగారం వెలిగింది.....ముత్తుకృష్ణయ్య దృష్టి ఇంకో కారుమీద పడింది.....

..........ఆ రోజు శివరాత్రి.

రాజమ్మ ఉపవాసంవుంది. వీధిలోనుండి వచ్చాడు రాము. దాహం వేసింది. తిన్నగా వంటింట్లోకి వెళ్ళాడు. బిందెలోనుండి గ్లాసులోకి నీళ్ళు వంచుకుని తాగాడు.

పూజలోనుండి లేచి ఇటు చూసింది రాజమ్మ. కాళికలా అయింది. "చండాలుడా! మడీ ఆచారం అంతా మంట కలిపేస్తావేం?" రామువీపు ఫెళ్ళుమంది. చప్పుడు విని పట్టమ్మ అటొచ్చింది.

వీపుని ఎడంచేత్తో రుద్దుకుంటూ అడిగాడు రాము: "మరీ— నన్నిప్పుడు ముట్టుకున్నావుకదా— నువ్వు మైల కాలేదూ?"

ఇంకా రెండు పెట్టింది అమ్మ.

రాము కంట నీటిబొట్టు రాలేదు కాని మూడో మనిషి ఎదుట అమ్మ కొట్టినందుకు అవమానం ముంచుకొచ్చింది.

"ఇంకో రెండంటించండి రాజమ్మా!" అంది పట్టమ్మ నవ్వుతూ.

రాముకు కోపం వచ్చింది. పట్టమ్మను వెక్కిరించాడు.

".....వెవ్వెవ్వే......మా అమ్మ నన్ను కొడితే మీకేం లాభం?..... మీకు పిల్లలుంటేగా ఆ బాధ తెలియడానికీ—?"

రాజమ్మ నిశ్చేష్టురాలయింది.

పట్టమ్మ గిరుక్కున వెనక్కు తిరిగింది.

ఆమె కంట మెరిసిన ముత్యం—ఆమె ముక్కుపుడకను కడిగింది. ఆ రాత్రి ఆమె నిద్రపోలేదు.

ముత్తుకృష్ణయ్య సికిందరాబాదువెళ్ళి మూడు రోజులయింది.

"మీకు పిల్లలుంటేగా?"

ఆ వాక్యం మళ్ళీ మళ్ళీ ఆమెను పొడిచింది. ఆమె మనసుని మెలికలు తిప్పింది. ఆకాశంలోకి ఒక్కసారి, అధఃపాతాళంలోకి మరొక్కసారి విసిరింది.

"మీకు పిల్లలుంటేగా—?"

"రాము చిన్నవాడు......ఏదో ఆవేశంలో వయసుకు మించిన మాట అన్నాడు.....అయినా వాడన్న మాట ఎంత నిజం!.....ఆడదాని జీవితవనంలో అమృతాన్ని వర్షించేది మాతృత్వం.....సృష్టి పెట్టే పరీక్షల దివ్య ఫలమయినది మాతృత్వం......ఆ అనుభూతి ఎంత అపురూపం! తన అమ్మాయినయితే తా నలా కొట్టేదా.....కొట్టేదా......ఏమో......ఆ తియ్యదనం, ఆ బాధ, ఆ జల్లు ఆ ఉరుము తనకు తెలియదా...... తెలుసు.....తనకు తెలుసు.....తనకే తెలుసు......కాని ఎవ్వరికీ తెలియదు......అలనాడు కర్ణునికన్న కుంతికయినా కడుపులోని చిచ్చు కక్కడానికి కురుక్షేత్ర సమయం వచ్చింది.....తన కది వస్తుందా......ఎప్పుడు......? ఈ హోదా, ఈ కారు, ఈ గౌరవం, ఈ నగలు ఎందుకొచ్చిన ఏడుపు......'

ఆమె బాధ అమావాస్యగా వెలిగింది. గోదావరిగా పొంగింది.

అమెతోపే ఇమిడిపోయింది—

58-వ పేజీ చూడండి



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నది, మీ సరియైన దర్శనుగురించియున్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్‌ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.


Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.



## ఆంధ్రా కాఫీ రకములు

గోల్డెన్ బ్లెండు — హోటల్సు బ్లెండు

పాప్యులర్ బ్లెండు — రెడ్ లేబుల్ కాఫీ




హెడ్డాఫీసు:— గుంటూరు - 2.

బ్రాంచీలు:— పట్నంబజారు, బ్రాడీపేట (గుంటూరు)

బాపట్ల, సత్తెనపల్లి, నర్సరావుపేట & హైదరాబాద్-20.


# మామి

9-వ పేజీ తరువాయి

మరునటిరోజు తెల్లవారుజామున ముత్తుకృష్ణయ్య వచ్చాడు.

"ఇంకా రెండు రోజులున్నాయి.....అయినా వచ్చేశాను" అన్నాడతడు. ఓసారి అతడివైపు చూసి వూరుకుంది పట్టమ్మ.

"మొదటి రెండు రోజులలోనూ ఏడువందలొచ్చాయి."

డబ్బు పోయినప్పుడు చెప్పడం అతడి అలవాటు కాదు.

"చంద్రన్ వచ్చాడా?" అని అడిగాడు.

"నిన్న పొద్దున వచ్చాడు."

"ఏమిటి.....కారు బాగా పోతూందిటనా?"

"వందా పది తెచ్చిచ్చాడు. మీ రెప్పుడొస్తారో అడిగాడు......" ఏదో వెలితిగా తోచింది ముత్తుకృష్ణయ్యకు. ఆమె బాధ ఏదయినాసరే, సంగీతంలో కరిగిపోగలదని అతడికి తెలుసు.

"సరేలే......సాయంకాలం 'సెమ్మంగుడి' కచ్చేరి వుంది......వెళ్దామా?"

"నేను రాను."

"పోనీ కారు పంపిస్తాను.....నువ్వెళ్ళిరా......"

ఆమె పలకలేదు........

ఆ సాయంకాలం రాజమ్మ చెప్పింది భర్తతో.....

"అబ్బాయి పట్టమ్మతో కచ్చేరికి వెళ్ళాడు..."

"కారులోనా?"

"ఆ......"

"కారులూ......కచ్చేరీలూ!! ఈ వైభవాయినవి జోరుగా వుంది—"

"అవును......మరి....ఏమండీ....మరీ..."

"ఏమిటే?" అని గట్టిగా అడిగాడు సుందరయ్య.

"పొద్దుట బియ్యం చెప్పానూ . . ."

"ఇప్పటికి లేవా?"

"చాలా కొద్దిగా వుంటే, గోధుమ రొట్టెలు చేశాను—"

"కాస్త బియ్యం ఆ మామిని అడిగి పుచ్చుకోకపోయావా?"

"పొద్దున్నుండీ ఆయన ఇంట్లోనే వున్నాడు . ."

"ఓ . . ." అని కాళ్ళు కడుక్కోవడానికి వెళ్ళాడు సుందరయ్య. రాజమ్మ లాంతరు వెలిగించింది. అయినా ఆవాటాలో ఇక్కడా అక్కడా చీకటి ఏలుతూనే వుంది ప్రక్కవాటాలో అరవైవాట్ల బల్బు—ఆమేరికాలా వెలిగిపోతుంది.

రెండేళ్ళు గడిచాయి.

రాము ఎస్. ఎస్. ఎల్. సి పరీక్ష రాశాడు.... కాలేజి—అని వాడిఆశ, కాదు ఉద్యోగం—అని వాడి నాన్న అన్నారు. ముత్తుకృష్ణయ్య రెండో కారు కొనలేదు. పట్టుమామి కచ్చేరీలకు వెళుతూనే వుంది ........

—ఓ రోజు సాయంకాలం.

నాలుగ్గంటలకు జ్వరంతో వణికిపోతున్న ముత్తుకృష్ణయ్యని తీసుకొచ్చారు ఇద్దరు .... రాము పరుగెత్తుకెళ్ళి డాక్టర్ సాయ్‌ని పిలుచు కొచ్చాడు.

ఆయనేదో ఇంజెక్షనిచ్చి, మాత్రలు రాసిచ్చాడు. పొద్దున వస్తానని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రాము నిద్రపోయాడు. పట్టు మామి పోలేదు.

పొద్దున ఎనిమిదింటికి కళ్ళు తెరవబోయాడు ముత్తు కృష్ణయ్య. మంచం ప్రక్కన నిల్చుంది పట్టమ్మ.

మెల్లగా కళ్ళుతెరచాడు ముత్తుకృష్ణయ్య. ఆమె గుండె రెపరెప లాడింది.

అతడేదో చెప్ప బోయాడు.

ఆమె వంగింది.

హఠాత్తుగా అతడి కళ్ళనుండి వేడి నీరు పెల్లుబికింది.

నిర్విణ్ణురాలయింది పట్టమ్మ. వంటింటోకి పరుగెత్తుకెళ్ళి కాఫీ తెచ్చింది.

"ఇది తాగండి .... కొస్త బలం వస్తుంది .... అసలు మాట్లాడ వచ్చు ...." అని అతడి పెదవులకు అందించింది.

అతడు కళ్ళు మూసుకున్నాడు. అతడి చెంపల మీద తడిని చీరె కొంగుతో తుడిచింది పట్టమ్మ. అతడి తలను దువ్వింది .... "మీకేమీ భయం లేదు. ఇంకో నాలుగు రోజుల్లో రఘూమ్మన బెంగుళూరుకు వెళ్తాడు ...." అని బలహీనంగా నవ్వింది. బెంగుళూరు—ముత్తుకృష్ణయ్య జీవితానికి అర్థం ఆశయం.

ఆయన తల అడ్డంగా ఊపాడు. కళ్ళతో తన దేహం వైపు చూపాడు .... అర్థం కాలే దామెకు... అతడి మీద కప్పియున్న దుప్పటిని తొలగించింది. మంచం మీద వున్న అతడి ఎడమ చేతిని తనచేతిలోకి తీసుకుంది. అతడి చెయ్యి వేడిగా కాలిపోతూ వుంది. మళ్ళీ మంచం మీద వుంచింది .... ఆ చెయ్యి నిర్జీవంగా దొర్లింది ....

వంకర పోయిన ముత్తుకృష్ణయ్య పెదవుల మధ్య నుండి 'ఓ' అన్న వికృతమయిన అరుపు వచ్చింది.

ఆమెకు తెలిసింది .... అతడికి పక్షవాతంవచ్చింది!

ఆ వంకర నోరు, ఆ వచ్చిపోయిన ఎడమచెయ్యి ఆ కదల్చలేని కాలు చూడడానికి భయం వేసింది రాముకు. మామి ఇంటి రేడియో పలకడం మానేసింది.... రెండు రోజులలో పట్టుమామి కొత్త వ్యక్తి అయిపోయింది. మునుపటిలా సరదాగా మాట్లాడ్డం లేదు.

వారం రోజు మామి ఇంటికి చాలామంది బంధువులు వచ్చారు. చంద్రన్ రోజు వస్తున్నాడు. రోజుకు మూడు సార్లు డాక్టర్ వచ్చి పోతున్నాడు.

అయిదవ రోజు రాత్రి.

దీపం వెలుగుతూంది. ముత్తుకృష్ణయ్య అలిసిపోయి మూలుగుతూ నిద్రపోతున్నాడు. బంధువులు ఒకరిద్దరు వరండాలో గురక పెడుతున్నారు.

దీపం దగ్గర కూర్చుని ఉత్తరం రాయసాగింది పట్టమ్మ.

'చిరంజీవి కమలకు—అమ్మ ఆశీస్సులు.

నువ్వు క్షేమంగా వున్నా వనుకుంటాను.

హాస్టల్ లో మా—'

ఇంతలో కెవ్వుమన్న రాముకేక వినిపించింది పక్కవాటామండి.

—నిద్రలో కెవ్వుమని అరిచాడు రాము. రాజమ్మ ఉలిక్కిపడి లేచి వచ్చి వాడిని లేపింది.

"ఏదో పీడకల వచ్చిందమ్మా—"

అమ్మ మంచి నీళ్ళిచ్చి రాముతలను నిమిరింది.

"అమ్మా నీ ప్రక్కన పడుకుంటానే!"

రెండు చేతులలోకి తన అబ్బాయిని తీసుకుంది రాజమ్మ. గడియారం పదకొండు కొట్టింది.

—"అమ్మా, నీ ప్రక్కన పడుకుంటానే ...." అన్నాడు రాము. రాజమ్మది ఎంతటి భాగ్యం. నిట్టూర్చింది పట్టమ్మ. ముత్తుకృష్ణయ్య వైపు చూచింది. అతడి నోటి మూలనుండి అసహ్యంగా చొంగ కారుతూంది. లేచివెళ్ళి తుడిచింది. మళ్ళీ కూచుంది దీపం దగ్గర .... ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి ......

—మరునటిరోజు

ఒక డాక్టరు తనవద్దకు వచ్చిన రోగితో శస్త్రచికిత్స చేయించుకోమని సలహా చెబుతూ "డబ్బు విషయమై దిగులుపడబోకండి. ముందు ఒక వెయ్యి ఇవ్వండి. తరువాత నెలకు రెండువందలు చొప్పున మూడేళ్ళపాటు ఇస్తే సరిపోతుంది." అని ఉపాయం చెప్పాడు.

రోగి: ఇది ఏదో కారు కొనుక్కునే పద్ధతిలా ఉన్నదే.

డాక్టరు: నిజమే! నేను కొనుక్కో దలచుకున్నది కారే.

జి. సర్వేశ్వరరావు (హైదరాబాదు.)

పొద్దున రాము భోజనం ముగించి ప్రక్క వీధిలోని రీడింగ్ రూమ్‌కి బయలు దేరాడు.

గుమ్మంలో ఒక రిక్షా ఆగింది.

అందులో ఓ నలభై ఏళ్ళ స్త్రీ వుంది. వంగిచూచి రాముని అడిగింది ఆమె .... "ఏం.. నాయనా! ముత్తుకృష్ణయ్య గారి ఇల్లు ఇదేనా?"

మృదువయిన స్వరం, పాలిపోయిన మొహం, చెమటకు తడిసి చెదరిన కుంకుమ, తీక్షణంగా దయతో వున్నచూపు—ఆమెను చూడగానే నమస్కారం పెట్టాలనిపించింది రాముకి— ఎందుకో!

"అవునండీ ఇదే ..." అన్నాడు రాము. ఆవిడ పెట్టెను దింపి ముత్తుకృష్ణయ్య వాటా దాకా మోసుకెళ్ళాడు. ఆవిడ ఇటూ అటూ చూస్తూ ఏమిటోగా మొహం పెట్టి నడిచింది.

"మామి, మామీ! మీ ఇంటికి ఎవరో వచ్చారు. . ."

పట్టమ్మ పరుగెత్తు కొచ్చింది...హఠాత్తుగా నిలిచి పోయింది ఆ వచ్చినావిడ కూడా ప్రతిమలా నిల్చుండి పోయింది,

వాళ్ళిద్దరూ కూడా ఒక్క నిముషం సేపు ఒకరి నొకరు చూసుకున్నారు .... పట్టుమామి మొహం నుండి ఏవో కిరణాలు ఒక్కొక్కటే రాలి పడిపోతున్నట్లు అన్పించింది రాముకి.

క్రొత్త ఆవిడ దృష్టి పట్టుమామిని దాటి గదిలోకి ప్రసరించింది.

రాముకి అయోమయంగా వుంది.

ఆఖరికి పట్టుమామి పలికింది: ఇప్పుడే వచ్చారా?

"కాను—"

పట్టుమామి ప్రక్కకు జరిగింది .... ఆవిడ చరచర నడిచి వెళ్ళింది.

మళ్ళీ వీధిలోకి వెళ్ళబోయిన రాము ఒక్క నిముషం ఆగాడు. పక్కవాటాలో నుండి ఘోరమైన ఏడుపు విన్పించింది .... ఆ కొత్తావిడ కాబోలు .... వెనక్కు తిరుగుదా మనుకున్నాడు రాము .... కానీ ముందుకు నడిచాడు.

ఆ రాత్రి —

రాము భోజనం అయింది. ఏదో పత్రిక తిరగవేస్తున్నాడు. వాళ్ళనాన్న భోంచేస్తున్నాడు.

" . . అన్నట్టు . . ఇందాక పట్టమ్మ, పెట్టె పడకాతో రిక్షాలో కనిపించిందే .... ఆయనకిలా వుండగా ఆవిడ ఏ ఊరు వెళ్తుంది!" అని అడిగాడు సుందరయ్య.

"అవునండీ .... పట్టమ్మ—ఈయన భార్య కాదుట !! —"

"ఆ." అన్న రామువెత్తిన పదివేల సర్పాలు నెత్తిన కాటేసి పడినట్లయింది.

"ఏమిటే?!!" అనబోయిన సుందరయ్య గొంతుకుఅడ్డంగా వెలక్కాయ పడ్డది ముద్దపడింది.

"నమ్మలేకుండా వున్నారు కదూ—నాకూ—ఆవిడ—అదే పొద్దున వచ్చిందే ఆవిడ ఈయన న్యాయాన పెళ్ళి చేసుకున్న భార్యట—ఆవిడ చెబుతుంటే అలాగే అనిపించిందండీ...."

"మరి ఇన్ని సంవత్సరాల నుండీ ఈవిడ ఎందుకు రాలేదటా?"

"ఈమెను వదిలేసి పట్టమ్మని—అప్పుడామె వితంతువట— తీసుకుని వచ్చేశాట్ట ముత్తుకృష్ణయ్య మొన్న ఎవరో బంధువులద్వారా ఈయనికిలా పక్షవాతం వచ్చిందని తెలిసిందట .... ఉండబట్ట లేక బయలుదేరి వచ్చింది .... ఏంతయినా భర్త కదండీ .... "

అమ్మగొంతులోని ఆర్ద్రత రాముని కొత్త లోకాల్లోకి విసిరింది.

"ఈమె పేరు సీతట! .... అదేమిటో ఆపేరున్న వాళ్ళందరికీ కష్టాలెక్కువండీ .... "

"హుం .... !" అన్నాడు సుందరయ్య.

రాములేచి వీధిలోకి వెళ్ళాడు.

—పట్టమ్మ పదహారేళ్ళ కూతురు మాయవరం హాస్టల్‌లో వుందనీ, ఆవిషయం ముత్తుకృష్ణయ్యకు ఈ నాటికీ తెలియదనీ, రాజమ్మ చెప్పిన గాథ రాము వినలేదు....

—మూడు రోజుల తర్వాత సుందరయ్యను బెల్లారు బదిలీ చేశారు ....

మద్రాసు విడిచి వచ్చే రోజున సీతమ్మ రాముకి చక్కిలాలు ఇచ్చింది . . . "ఆరోజు .... బండి దిగగానే నాపెట్టెను తీసుకొచ్చి పెట్టావు నాయనా మంచి వాడివి — "

తలవంచు కున్నాడు రాము.

"గుర్తుంచుకో నాయనా .. " అందిసీతమ్మ కళ్ళల్లో తడితో.

"వస్తాను .. మా—మీ...!" అన్నాడు రాము.

సీతమ్మను రాము అలా పిలవడం అదే మొదటి సారి —

* * *

నాలుగేళ్ళ తర్వాత —

బెంగుళూర్ ఫాక్టరీలో రాముకి మూడేళ్ళ సర్వీస్ పూర్తి అయింది—

చిన్నప్పటి బడి మిత్రుడు సీను పెళ్ళి నిమిత్తం పది రోజులు సెలవు పెట్టి మద్రాసు వెళ్ళాడురాము.

ట్రిప్లికేన్ సింగరాచారి వీధిలో ముహూర్తం అయిపోయింది. సాయంకాలం మెరీనా బీచి వైపు వెళ్దామని బయలు దేరాడు రాము చిన తంబి వీధిలో నడుస్తున్నాడు.

హఠాత్తుగా ఆగిపోయాడు!

కుడివైపు వో పెంకుటింటి అరుగు మీద ఒకాయన కూర్చుని వున్నాడు—చేతిలో ఏదో దిన పత్రికలా వుంది దీక్షగా చూస్తున్నాడు . . . వల్చగా వున్న తెల్లటి క్రాపు—పొడుగాటి నల్లటి విగ్రహం—శంకర నోరు— .... రాము మనసులో పాత తలుపులు తెరచుకున్నాయి—

అవును .... ఆయనే!

దగ్గరకు వెళ్ళాడు—

"ఏమండీ .... నేను గుర్తున్నానా?" అని అడిగాడు.

ఆయన కళ్ళ మీదుగా కుడిచేతిని పెట్టుకుని పరీక్షగా చూశాడు. గడ్డం గోక్కున్నాడు — నేను .... మీతోబాటు కాపురం వుండిన రాజమ్మ గారి అబ్బాయి నండీ!"

"ఓ! తుబ్బా .... నీపేరు రాము కదూ ?"

"అవును"

"రావోయ్ .... ఇలా రావో ...." అని ఆయన కాస్త జరిగాడు. రాము అరుగు మీద కూర్చున్నాడు.

"ఊ! .... మీరు ప్రస్తుతం ఏ ఊళ్ళో ఉంటు న్నారూ ? .... అమ్మ నాన్న బావున్నారా ? ను ఖ్యక్కడయిన ఉద్యోగం చేస్తున్నావా?"

రాము సంగ్రహంగా అన్నీ చెప్పాడు .... ఇంటి లోపలివైపు చూశాడు.

"మామి కదూ .... ఇంకో పదినిముషాల్లో వచ్చేస్తుంది." అన్నాడు ముత్తుకృష్ణయ్య.

"—గుడికి వెళ్ళిందా?" అని అడిగాడు రాము. ముత్తుకృష్ణయ్య "ఊ"! అన్నట్లని పించింది.

—కాసేపు తర్వాత సీతమ్మ వచ్చింది .... అరనిముషం పరకాయించి చూచింది .... "ఏం రామూ! ఎప్పుడొచ్చావ్ నాయనా .... లోపలికిరా" ఆమెవెంట నడిచాడు రాము.

నడిగాళ్ళేం తీసింది సీతమ్మ. చిరికొంగులో నుండి రెండు పొట్లాలను తీసి క్రింద ఉంచింది. రాము దృష్టి వాటిమీద వుండడం గమనించి ...." ఇది ఉప్పు నాయనా.... ఇవేమో నాకు బార్లీగింజలు అంది.

"ఏం .... మీ ఆరోగ్యం బాగులేదా?"

ఆమె నవ్వింది.

రాము మళ్ళీ అడిగాడు:"" ఏం మందు తీసు కుంటున్నారూ?"

"ఆస్పత్రి ఇక్కడికి చాలదూరం. నాయనా .... రోజల్లా అలసిన తర్వాత అంతంత దూరాలు నడవలేను .... యాభై యేళ్ళు ఏడు వస్తుందికదా ఇలాటివన్నీ ఇహ మామూలే .... "

రాము కనుబొమలు ముడుచుకున్నాయి." మీ టాక్సీలో వెళ్ళి రావచ్చుకద మామీ?!"

ఆమె మళ్ళీ నవ్వింది.

"టాక్సీయా? .... మీరు ఊరొదిలిన నెల

"ప్రాగుబోతుల శరణాలయా నికి మీ రేమైనా సహాయం చేస్తా రేమో ననివచ్చా" అంటూ నసి గాడు తలుపు తట్టిన పెద్దమనిషి, ఇల్లుగలావిడ ఎదురుగా ప్రత్యక్ష మవుతే.

ఆవిడ: ఓహో! దానికేం. రాత్రి 10 గంటల తరువాత రండి. ఆయనగారిని తీసుకు వెడుదురు గాని.

ఆర్. రామమోహన్ (పులిచింతల)

రోజులకే దాన్ని అమ్మేశామోయ్ .... అడబ్బు డాక్టరుకు అప్పులకూ సరిపోయింది—"

"టాక్సీని అమ్మేశారా? .. మరిప్పుడు ...... ఇప్పుడు" ఆమె మెడలోని పసుపు దారాన్ని, ఆమె ముక్కు వుడకగా నిలిచిన పూచికపుల్లను, ఆమె చేతిమీది రబ్బరు గాజుల్ని అప్పుడు గాని చూడలేదు రాము.

"మీ మామయ్య చెయ్యీ కాలూ అలాగే వుండి పోయాయి .... ఏకర్రనో గోడనో ఊతగాఅడుగులు వేస్తారు—అంతే .. "

కళ్ళుమూసుకున్నాడు రాము. అగది చీకటిగా, ఇరుకుగా వున్నట్లనిపించింది.

" .... అంచేత నేనో ఏడాదిమండీ జడ్జి సోమే శ్వరరావు గారింటో వంటకు కుదిరాను. ఒపూట భోజనంపెట్టి నెలకు పాతిక రూపాయి లిస్తున్నారు.

రాము గుండె చీలినట్లయింది .... సీతమ్మ ఆ చిరునవ్వు మొహంతోనే ఇంకా చెప్పుకు పోతూంది ..

" .... ఏదో అలాఅలా దానితోనే సర్దుకు పోతున్నాము. ఆయనకు ఒక్కోసారి ఏదో అదృష్టం కొద్దీ ఆ రేసుల్లో పడి, ఇరవయ్యో వస్తుంటాయి.... పోతే .... రూపాయా, రెండూ పోతుంటాయి...."

"ఇంకా రేసులా?"

"పిచ్చివాడా! ఆయనకు చిరకాలపు అలవాటు ఈ నాటి దటోయ్ .... అది ఎన్నటికీ పోదు ...."

వెనకటి రోజుల్లో ఒక హోటల్ పనిమనిషిని టాక్సీ యజమానిగా చేసింది ఆ రేసులేగా—అంది రాము మెదడు.

"అయినా అగుర్రాలూ ఆ గెలుపులు ఓటములూ తప్ప ఆయనకు మాత్రం జీవితంలో ఎదురు చూడ్డానికి ఏముంది చెప్పు!" అంది సీతమ్మ.

"మామీ!! మీరూ..మీరు—" రాముకి మాటలు రాలేదు .... అతడి మొహం వేడిగా బరువుగా అయింది ....

"ఇందులో నా ప్రత్యేకతేముంది నాయనా .... కష్టాలలోవున్న మనిషి ప్రక్కన వుండడం మన ధర్మం .. ఆమనిషి భర్త అయినప్పుడు—అది భార్యకు విధి మాత్రమేకాదు, సంతోషంగా స్వీకరించవలసిన వరంలాంటిది కూడా—"

"మరి సుఖాలో?"

"సుఖాలను ఎవరయినా పంచుకోవచ్చు గదు టోయ్?" అని గూట్లోనుండి చిన్నడబ్బాతీ సింది సీతమ్మ.చిన్నకాగితంమీద గుప్పెడుఅటుకులుపోసింది.

"ఇవి తిను, నాయనా!"

—కళ్ళల్లోకి వచ్చిన నీటిని విశ్వప్రయత్నంతో ఆపుకున్నాడు రాము ....

—అరగంట తర్వాత—

మెరీనా మెత్తటి ఇసుకలో వెనక్కు చేతులానించి కూర్చుని వున్నాడు రాము.

అతడి పాదాలకు పదడుగుల దూరంలోనీలిసముద్రం ఆడుకుంటుంది.... కెరటాలు నవ్వినప్పుడల్లా తెల్లటి పళ్ళవరుసలా మెరుస్తూంది పొంగుతున్న నురుగు.

అవల, కంటికి అనని అవతలి తీరాన, నీరూ నింగీ చేతులు కలిపిన సరిహద్దున—ఎర్రటిముద్దగా ఉదయించాడు చంద్రుడు.

సాగరుడి ఉపరితలం పులకరించి వెండిగా వెలిగింది.

రాము కళ్ళు మూసుకున్నాడు.

ఓ పెద్ద అల వచ్చి అతడి మోకాలిని తాకింది. ఉలిక్కి పడి లేచాడు రాము.

ఆకాశం. మీద మబ్బులు చేరుతున్నాయి.

రాము ఇటూ అటూ చూచాడు.

జనం చాలా తక్కువయ్యారు. బీచి అంతాకలిసి పొగుచేస్తే పట్టుమని పాతికమంది వుండరేమో ....

రాము నవ్వుకున్నాడు.

అదే .... వెలుతురు వేళయితే సాగరుడి సంతోషాన్ని పంచుకోడానికి ఎంత మంది వస్తారనీ ....!

చీకటయేసరికి ఇళ్ళులేనివాళ్ళూ, ఇంకా అలాటి వాళ్ళూ—ఏవోకొద్ది తప్ప ఎవ్వరూ వుండరు ఈ ఇసుకల్లో.

"సుఖాలను ఎవరయినా పంచుకోవచ్చు కదు టోయ్—" అంది సీతమామి.

హఠాత్తుగా ఓ మెరుపు మెరిసింది.

ఎక్కడయినా తలదాచుకుందామని పరుగెత్తాడు రాము.

టపటప మంటూ జోరుగా మొదలయింది వర్షం— ★